సాక్షి
హనుమకొండ

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025

I



పర్యాటక స్వర్గం
ములుగు జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - IIలో▸



ఆగిన పెన్షన్
కేయూ టీచింగ్, నాన్ టీచింగ్, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు జూలై, ఆగస్టు నెలల పెన్షన్ గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. - IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
$26^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

ఏసీపీతో నేడు ఫోన్ ఇన్



వరంగల్ క్రైం: హనుమకొండ ఏసీపీ పి.నరసింహరావుతో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుంది. దసరా పండుగకు ఊర్లో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇళ్లల్లో చోరీలు జరగకుండా భద్రతకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఏసీపీతో మాట్లాడవచ్చు.

తేదీ : 27-09-2025, శనివారం

ఫోన్ చేయాల్సిన నంబర్:
87126 85112

సమయం :
ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

నిధుల సమీకరణ..!



వైన్స్‌లకు పెద్దమొత్తంలో దరఖాస్తులకు ప్లాన్

- మద్యం దందాలో 'రియల్' వ్యాపారులు
- రంగంలోకి రాజకీయ నేతల బినామీలు
- అత్యధికంగా షాప్‌లు దక్కించుకోవడమే లక్ష్యంగా 'సిండికేట్'
- ఉమ్మడి వరంగల్‌లో 294 షాపులు.. ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, వరంగల్:

మద్యం దందావైపు 'రియల్' వ్యాపారులు..

రియల్ ఎస్టేట్ వ్యాపారులు మద్యం దందావైపు చూస్తున్నారు. మార్కెట్ అప్ అండ్ డౌన్స్ నేపథ్యంలో 2023–25 నుంచే కొందరు లిక్కర్ వ్యాపారంలో అడుగు పెట్టారు. ఈసారి ఇప్పుడున్న వ్యాపారులకు తోడు తాము సైతం అదృష్టం పరీక్షించుకునేందుకు కొందరు సన్నద్ధమవుతున్నారు. 2025–27 సంవత్సరానికి శుక్రవారంనుంచి టెండర్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో టెండర్లలో వైన్స్ (ఏ–4)షాపులు అత్యధికంగా దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులతో కలిసి 'సిండికేట్' అవుతున్నారు. మరోవైపు కొందరు రాజకీయ నాయకుల బినామీలు కూడా ఈసారి పెద్దసంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేసే యోచనలో ఉన్నారు. ఇప్పటికే మద్యం వ్యాపారంలో పేరుగాంచిన వ్యాపారులే మళ్లీ అత్యధిక దుకాణాలు దక్కించుకునేందుకు గ్రూపులుగా ఏర్పడుతున్నారు. నిర్ణీత సమయంలో షెడ్యూల్స్ దాఖలు చేయడంతోపాటు టెండర్ల ద్వారా 'లక్కీ' వరిస్తే సరి.. లేదా దుకాణాలు దక్కే కొత్త వాళ్లకు రూ.లక్షల గుడ్‌విల్ ఇచ్చి కైవసం చేసుకునేందుకు ఇప్పటినుంచి నిధులు సమీకరిస్తున్నారు. పాత మద్యం వ్యాపారులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. రాజకీయ నేతల బినామీలు.. ఇలా పోటాపోటీగా టెండర్లకు సిద్ధమవుతుండడం వైన్స్‌షాపులకు ఈసారి భలే గిరాకీ ఉండబోతోంది.

- 2023–25 సంవత్సరానికి జరిగిన టెండర్లలో హనుమకొండ చెందిన ఓ మద్యం వ్యాపారి కొందరిని కలుపుకుని ట్రైసిటీతోపాటు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పెలువురి పేర్లపై 600 (రూ.12 కోట్లు ఖర్చు చేసి) దరఖాస్తులు వేశారు. మొత్తంగా ఆ కూటమి.. 32 దుకాణాలను (లక్కీ డ్రా, గుడ్‌విల్ పద్ధతిన) కైవసం చేసుకుంది.
- జేఎస్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ మద్యం వ్యాపారి గత ఆబ్కారీ సీజన్‌లో హనుమకొండ, పరకాల, రేగొండ తదితర ప్రాంతాల్లో మొత్తం 70 వైన్‌షాపుల కోసం దరఖాస్తు చేశారు. ఒక్కో షాపునకు రూ.2 లక్షల చొప్పున రూ.1.40 కోట్లు దరఖాస్తుల ఖర్చు కాగా.. డ్రాలో రెండు రాగా, ఒకటి గుడ్‌విల్ ఇచ్చి సొంతం చేసుకున్నారు.

...ఈసారి కూడా మద్యంషాపుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అమ్ముడుపోతాయని ఆబ్కారీశాఖ భావిస్తోంది. గతేడాది ఉమ్మడి వరంగల్‌లో 294 వైన్స్ (ఏ–4)షాపులకు 15,926 దరఖాస్తులు దాఖలయ్యాయి. అప్పుడు దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. 15,926 దరఖాస్తులపైన రూ.318.52 కోట్లు నాన్ రీఫండబుల్‌గా ఆబ్కారీ శాఖకు ఆదాయం సమకూరింది. ఈసారి ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ, సింగిల్ విండో, మున్సిపల్ తదితర స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు సమ్మక్క-సారలమ్మల జాతర కూడా ఉంది. ఈ లెక్కన ఈసారి దరఖాస్తుల సంఖ్య 20 వేల వరకు పెరిగే అవకాశం లేకపోలేదన్న చర్చ జరుగుతోంది.

ఈ దుకాణాలపై ప్రత్యేక గురి..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా అత్యధికంగా విక్రయాలు జరిగే వైన్స్‌షాపులపై వ్యాపారుల సిండికేట్ గురిపెట్టింది. పాత వ్యాపారులతోపాటు కొత్తగా ఈ దందాలోకి దిగేవారు అధికారులను సంప్రదించి ఓ జాబితా తయారు చేసుకున్నట్లు సిండికేట్ వర్గాల సమాచారం. ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా ప్రతీ సంవత్సరం రూ.2,250 కోట్ల నుంచి రూ.2,590 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ మూడేళ్లలో అత్యధికంగా విక్రయాలు జరిగిన షాపులకు ఈసారి ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశం ఉంది. కాగా గతంలో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఓ వైన్స్ ఒక్క ఏడాదిలో రూ.61.04 కోట్లు, హనుమకొండ సిటీ హంటర్‌రోడ్‌లోని ఓ వైన్స్ అత్యధికంగా రూ.38.21 కోట్ల మద్యం విక్రయాలు జరిపింది. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా తొర్రూరులోని ఓ వైన్స్ రూ.14.33 కోట్ల మద్యం విక్రయాలు జరిపింది. తొర్రూరులోనే మరో మరో వైన్స్ రూ.6.5 కోట్లు, కమలాపూర్ మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో రూ.6,39,82,000ల విక్రయాలు జరిగినట్లు రికార్డులు చెప్తున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ రూ.9.35 కోట్ల మద్యం విక్రయించగా, పాలకుర్తిలోని వైన్స్‌లో రూ.14.19 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అలాగే వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీలో మరో ఎనిమిది, భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం, చిట్యాలతోపాటు ఆరు, ములుగు జిల్లాలో ఏటూరు నాగారం, ములుగు, మేడారం, పస్రాలతో పాటు మేడారం రూట్‌లోని అన్ని షాపుల్లో విక్రయాలు బాగా జరుగుతాయి. మొత్తం 294 షాపుల్లో 150 దుకాణాలకు ఎక్కువ దరఖాస్తులు పడతాయని భావిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో మద్యం దుకాణాలు రిజర్వేషన్ల వివరాలు

మొత్తం వైన్స్ (ఏ4) షాపులు :	294
ఎస్సీ రిజర్వుడ్	33
ఎస్టీ రిజర్వుడ్	13
గౌడ్‌లకు కేటాయించినవి	74
జనరల్	184
2023-25 టెండర్లకు వచ్చిన దరఖాస్తులు	15,926
దరఖాస్తుల ద్వారా వచ్చిన ఆదాయం (రూ.కోట్లు)	318.52
2025-27 దరఖాస్తుల అంచనా: సుమారు 20 వేల వరకు	

కలెక్టరేట్‌లో వైన్స్ దరఖాస్తుల స్వీకరణ
జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఈఎస్ చంద్రశేఖర్

కాజీపేట అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో వైన్స్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని కాజీపేట, హనుమకొండ, వరంగల్ అర్బన్, ఖిలావరంగల్ స్టేషన్ల పరిధిలో గతంలో 65 వైన్స్ ఉండగా.. వరంగల్ రూరల్ నుంచి వర్ధన్నపేట, పరకాల నుంచి రెండు వైన్స్ అదనంగా రావడంతో ప్రస్తుతం 67 వైన్స్‌కుగాను 2025–27 రెండేళ్ల కాల పరిమితికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు డీపీఈఓ పేరిట డీడీ లేదా చాలన్‌ను నేషనల్ బ్యాంక్ ద్వారా తీసుకుని దరఖాస్తుతో సమర్పించాలని సూచించారు. అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అక్టోబర్ 23న లక్కీ డ్రా ద్వారా వైన్స్ కేటాయింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు చంద్రమోహన్, దుర్గాభవాని, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో ర్యాంప్‌వాక్ చేస్తున్న విద్యార్థులు



ఉట్టిపడిన సంప్రదాయం
నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ర్యాంప్ వాక్ చేశారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

- హసన్‌పర్తి



బతుకమ్మలతో వస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఉత్సాహంగా 2కే రన్



జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 2కే రన్, సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ రన్ హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం, పబ్లిక్ గార్డెన్, అశోకా జంక్షన్ మీదుగా స్టేడియం చేరుకుంది. రన్, సైక్లింగ్ పోటీలను హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో స్నేహపూరిత వాతావరణం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 2కే రన్ విజేతలు శివ, రవితేజ, ఆరోగ్యపాల్, సైక్లింగ్ విజేతలు చరణ్‌తేజ్, భార్గవ్, హర్షిత్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఒలింపిక్స్ సంఘం కోశాధికారి తోట శ్యాంప్రసాద్, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాయబారపు నవీన్ కుమార్, దేవరకొండ ప్రభుదాస్, శ్రీమన్నారాయణ, దేవిక, కూరపాటి రమేశ్, రాజు, మహ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ప్రత్యేక శిబిరాలు వినియోగించుకోవాలి
డీఎంహెచ్ఓ అప్పయ్య



పీహెచ్‌సీకి వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

ఎంజీఎం: స్వస్థ్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా స్పెషలిస్ట్ వైద్య నిపుణులతో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు వినియోగించుకోవాలని హనుమకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య అన్నారు. శుక్రవారం కొండపర్తి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ లీనా ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను పరిశీలించి అక్కడికి వచ్చిన మహిళలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ అప్పయ్య మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు తమ పరిధి క్యాంపుల షెడ్యూల్ ప్రకారం మహిళలను వైద్య శిబిరాలకు తీసుకురావాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య తెలుసుకొని వారికి మందులు అందిస్తున్న తీరును, ఫాలోఅప్ సేవలు పరిశీలించారు. ప్రైవేట్‌లో చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వం వైపు మళ్లించాలన్నారు. అనంతరం స్టోర్స్, ప్రసవ గదులను పరిశీలించిన డీఎంహెచ్ఓ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్యాంప్రసాద్, ఆయుష్ వైద్యాధికారి కోకియా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, హెచ్ఈఓ రవీందర్, సూపర్‌వైజర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షల తేదీల్లో మార్పు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల పరిశోధకులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ముందస్తుగా ప్రకటించిన తేదీలను మార్చి అక్టోబర్ 22, 25వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పరిశోధకులు గమనించాలని కోరారు.

న్యూస్ రీల్

నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో నేడు (శనివారం) 'బతుకమ్మ వేడుకలు' నిర్వహించనున్నట్లు ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ తెలిపారు. ఈ మేరకు ఈ వేడుకలకు హాజరుకావాలని నాయకులతో కలిసి కలెక్టర్ స్నేహ శబరీష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వై.వి గణేశ్‌ను కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకుడు లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు పృథ్వీ, వేణుగోపాల్, అనురాధ, రజిత, ఫాతిమా, సుకన్య పాల్గొన్నారు.

నేటినుంచి జూనియర్ కళాశాలలకు సెలవులు



విద్యారణ్యపురి: ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు నేటి(శనివారం) నుంచి అక్టోబర్ 5 వరకు దసరా సెలవులు ఇంటర్మీడియెట్ విద్య ఉన్నతాధికారులు ప్రకటించినట్లు ఇంటర్ విద్య ఆర్జేడీ గోపాల్ శుక్రవారం తెలిపారు. కళాశాలలను అక్టోబర్ 6న రీ ఓపెన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దసరా సెలవుల్లో ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇంటర్ విద్య ఆర్జేడీ ఎ.గోపాల్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కో–ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు వచ్చేలా, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. వ్యసనాలకు లోనవ్వకుండా తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు



శ్రీనివాస్



రాధిక

కేయూ క్యాంపస్: కేయూలోని యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధికను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిపాటు వీరు పదవిలో ఉంటారు. వర్సిటీలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ కార్యాలయంలో ఈ ఇద్దరు బాధ్యతలు నిర్వర్తిస్తారు. బాయ్స్‌కు ఒకరు, గర్ల్స్‌కు మరొకరు యూత్ ఆఫీసర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ప్రతిపాదనలివ్వండి.. నిధులు తెస్తా

- ఎంపీ కడియం కావ్య
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ కావ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందిస్తే వాటి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. రైల్వే సంబంధిత అంశాల్ని, సమస్యల్ని తన దృష్టికి తీసుకొస్తే రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వరద నీరు నిల్వకుండా తీసుకునే చర్యలపై ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలందించేందుకు జిల్లాకు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరైందని పేర్కొన్నారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బోడగుట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య, భద్రకాళి దేవాలయం వద్ద పార్కింగ్ ఇబ్బందులు, న్యూ శాయంపేటలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులు, వెజ్, నాన్ మార్కెట్ ఏర్పాటు, తదితర అంశాలను ప్రస్తావించారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్డీఓ వైవీ గణేశ్, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, కాజీపేట, హనుమకొండ తహసీల్దార్లు భావ్‌సింగ్, రవీందర్‌రెడ్డి, మున్సిపల్, కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, అధికారులు

స్కందమాత అలంకరణలో భ్రమరాంబిక



స్కందమాత అలంకరణలో ఐనవోలు భ్రమరాంబిక అమ్మవారు

ఐనవోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో భ్రమరాంబిక అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో నిత్యాహ్నికం, నవావర్ణ అర్చన, భావనోపనిషత్ పారాయణం, చండీ సప్తశతి పారాయణం, చండీ హవనం విశేషంగా నిర్వహించారు. మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలతో ఐదో రోజు కార్యక్రమాలు ముగించారు. అమ్మవారి విశేష అలంకారాలను దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ కోరారు. చండీహోమంలో ఈఓ కందుల సుధాకర్, సూపరింటెండెంట్ అద్దంకి కిరణ్‌కుమార్ దంపతులు, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, మధు శర్మ, శ్రీనివాస్, నరేష్‌శర్మ, దేవేందర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'సీల్డ్ కవర్'లో నివేదిక!

- ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచేనా?
- కలెక్టరేట్ పాలన గాడిన పడేనా?
- గుణపాఠం నేర్చుకుంటారా?



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో ఇటీవల ఓ అధికారి మహిళా ఉద్యోగిపై అసభ్యంగా ప్రవర్తించడం, ఆమె అధికారులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈఘటనపై ఏర్పాటైన ఐసీసీ కమిటీ ఎట్టకేలకు శుక్రవారం సీల్డ్ కవర్‌లో తుది నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. అసమగ్ర నివేదికపై కలెక్టర్ స్నేహ శబరీష్ ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా, కలెక్టర్ ఆదేశాలతో కమిటీ ప్రతినిధులు అత్యవసరంగా సమావేశమై తాము సేకరించిన సమాచారం ఆధారంగా తుది నివేదిక రూపొందించి సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌లో అందజేసినట్లు తెలిసింది.

పర్యవేక్షణ లేకనేనా..

కలెక్టరేట్‌లో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ఇలాంటి ఘటన జరగడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. అయితే సిబ్బంది పనితీరు, జరుగుతున్న వ్యవహారాలపై సరైన పర్యవేక్షణ లేకనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలుస్తోంది. ఒక సెక్షన్‌లో జరుగుతున్న ఘటనలు సిబ్బంది పనితీరు వంటి వ్యవహారాలపై సెక్షన్ సూపరింటెండెంట్లకు కనీస సమాచారం లేకపోవడం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. కాగా, కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారుల సూచనలు కూడా సూపరింటెండెంట్లు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. డ్యూటీలు ఎప్పుడు ఎక్కడ ఎవరికి కేటాయించాలనే దానిపై స్పష్టత లేకపోవడం కూడా ఇలాంటి ఘటనకు కారణం అవుతుందని కలెక్టరేట్ సిబ్బంది అంటున్నారు. ప్రస్తుత ఘటనతో అయినా పర్యవేక్షకులు కళ్లు తెరిచి పాలనపై పట్టు సాధిస్తారనే నమ్మకం ఉద్యోగుల్లో లేకుండాపోయింది.

చర్యలపై మీనమేషాలు

కలెక్టరేట్‌లో జరిగిన ఘటనపై బాధితులు స్వయంగా గోడు వెళ్లబోసుకున్నప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ దాకా వస్తే కానీ తెలియదన్నట్లుగా కొందరు అధికారుల తీరు ఉండడం విమర్శలకు తావిస్తోంది.

సమావేశం ఏర్పాటు చేయండి

ఇప్పటికైనా కలెక్టరేట్ ఉద్యోగులతో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి అంతర్గత సమస్యలపై చర్చించాలని వారి నుంచి సూచనలు స్వీకరించాలని ఉద్యోగులు ఉన్నతాధికారులను కోరినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఉద్యోగులకు సూచించినట్లు తెలిసింది. ఇలాంటి కార్యక్రమాల వల్ల కొంతైనా ఫలితం ఉండొచ్చని ఉద్యోగులు అంటున్నారు.

కలెక్టర్ చర్యలపై ఉత్కంఠ

కలెక్టర్‌కు చేరిన సీల్డ్ కవర్ నివేదికపై ఉద్యోగుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఈ విషయంలో నిందితుడిని మరొక చోటుకు స్థానచలనం కల్పించిన కలెక్టర్.. నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ప్రస్తుతం నివేదిక చేతికందడంతో ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఉత్కంఠంగా మారింది.

దసరా రోజున వైన్ షాపుల బంద్

ఖిలా వరంగల్: గాంధీ జయంతి రోజునే దసరా రావడంతో వైన్స్ షాపు నిర్వాహకులు దసరా రోజున వైన్స్ బంద్ అని ఫ్లెక్సీలు పెట్టారు. ఆరోజు మటన్, చికెన్, మద్యం అమ్మకాలు నిషేధం కావడంతో ఇప్పటి నుంచే మందుబాబులు మద్యం కొనిపెట్టుకుంటున్నారు. ఇలా.. పండుగలకు వైన్స్ బంద్ ఉంటే 1–2 రోజుల ముందు బోర్డు పెడతారు. వారం ముందుగానే ఫ్లెక్సీలు ప్రదర్శిస్తుండడంతో మద్యం అమ్మకాలు మరింత జోరందుకున్నాయి.

బాలల రక్షణకు కృషి చేయాలి
అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటిస్తూ బాలల రక్షణ కోసం కృషి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన నగరంలోని రెవెన్యూ కాలనీలోని ఒయాసిస్ ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్, మల్లికాంబ మనోవికాస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల నిర్వాహకులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల్లోని డార్మెటరీ, వాష్ రూమ్స్, డైనింగ్ హాల్, పరిసరాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో–ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికి సుధాకర్, ఇన్‌చార్జ్ డీసీపీఓ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక తదితరులున్నారు.

క్లుప్తంగా

29న సద్దుల బతుకమ్మ

ఐనవోలు: ఈ నెల 29న సద్దుల బతుకమ్మను నిర్వహించుకోవాలని ఐనవోలు మల్లికార్జున స్వామి దేవాలయ ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ పండుగను సంప్రదాయ, ఆచారాల ప్రకారమే ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటున్నట్లు తెలిపా రు. తొమ్మిది రోజుల్లో చివరిరోజున సద్దుల బతుకమ్మను నిర్వహించే సంప్రదాయాన్నే కొనసాగించాలని సూచించారు. గతంలో పండుగ నిర్ణయంలో సందేహం కలిగినపుడు కొడకండ్లకు చెందిన పాలకుర్తి నరసింహరామ సిద్ధాంతి సూచించిన విధంగానే సద్దుల బతుకమ్మ జరుపుకున్నట్లు గుర్తుచేశారు. వారి మార్గదర్శకంగా బ్రాహ్మణ సంఘం పెద్దల నిర్ణయం మేరకు 29నే ప్రజలు సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని మధుకర్ శర్మ ప్రకటనలో స్పష్టం చేశారు.

కొలంబో మెడికల్ కళాశాల కౌన్సెలింగ్‌కు అనుమతి

కాజీపేట రూరల్: వరంగల్ హంటర్‌రోడ్‌లోని కొలంబొ వైద్యకళాశాల రెండోదశ కౌన్సెలింగ్‌కు కేఎన్ఆర్ యూహెచ్ఎస్ అనుమతి లభించిందని ఆ కళాశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ కాంపిటెంట్ అథారిటీ కోటా కింద ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశానికి రెండో దశ కౌన్సెలింగ్ కోసం వెబ్ ఆప్షన్లను ఉపయోగించుకోవడానికి గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌కు కొనసాగింపుగా.. ఇందుకు చివరి తేదీని నేటి(శనివారం) మధ్యాహ్నం 2 గటల నుంచి 29వ తేదీ ఉదయం 11 గంటల వరకు పొడిగించినట్లు తెలంగాణ కేఎన్ఆర్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు.

అమ్మవారిపేటలో గంజాయి దహనం



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న గంజాయిని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం దహనం చేసినట్లు డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 18 కేసుల్లో పట్టుబడిన రూ.3.63 కోట్ల విలువ గల 856 కిలోల గంజాయిని అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ వద్ద దహనం (ఇన్సిరేషన్ పద్ధతిలో) చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ డేవిడ్‌రాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌విద్య ఆర్‌జేడీ బాధ్యతల స్వీకరణ



గోపాల్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న లెక్చరర్ల సంఘం బాధ్యులు

విద్యారణ్యపురి: ఇంటర్‌విద్య ఇన్‌చార్జ్ ఆర్‌జేడీగా గోపాల్ హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఆర్‌జేడీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ తదితరులు ఆర్‌జేడీ గోపాల్‌ను సన్మానించారు. పూలబొకే అందించి అభినందించారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ల సంఘం బాధ్యులు రేవతి, జ్యోతిర్మయి, జాన్ పాషా, శోభ, పెన్షనర్ల సంఘం బాధ్యులు బాబురావు, ధర్మేంద్ర, వెంకటేశ్వ ర్లు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యాటక స్వర్గం

- పర్యాటకులను ఆకర్షిస్తున్న బొగత
- యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప
- ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర మేడారం
- కనువిందు చేస్తున్న లక్నవరం
- స్వయంభుగా వెలసిన హేమాచల లక్ష్మీ నరసింహస్వామి

టూరిజం స్పాట్‌గా విరాజిల్లుతున్న ములుగు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

చదువులు.. ఉద్యోగం.. కుటుంబ బాధ్యతలతో నిత్యం సతమతమయ్యే జీవనానికి కాస్త ఉపశమనం కలిగించేది పర్యాటకం.. అయితే ఎక్కడో దూరంగా ఉన్న ప్రదేశాలకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలు తప్పవు. ఈనేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సమీపంలో ఉండి నిత్యం ఆకర్షిస్తున్న ప్రస్తుత ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలతో నేడు(శనివారం) ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ములుగు



లక్నవరం సరస్సు

వినోద కేంద్రం.. లక్నవరం

గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ పరిధిలోని లక్నవరం సరస్సు పర్యాటకులకు వినోద కేంద్రంగా మారింది. 13వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన ఈ సరస్సు ఐదు వేల ఎకరాల విస్తీర్ణంతో 65 చిన్న కొండల మధ్య 13 ద్వీపాలతో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది. సరస్సులోని ద్వీపాలను కలిపే సస్పెన్షన్ బ్రిడ్జిలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకుల వినోదం కోసం సరస్సులో బోటింగ్, బోట్ రైడింగ్, ఐలాండ్‌లోని రిసార్ట్స్, గెస్ట్‌హౌజ్‌లు, క్యాంపు ఫైర్ ఉండడంతో కుటుంబ సమేతంగా వారాంతపు రోజుల్లో ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

స్వయంభుగా వెలసిన హేమాచలుడు



శ్రీహేమచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మంగపేట మండలం మల్లూరు గుట్టపై స్వయంభుగా వెలసిన హేమచల లక్ష్మీ నరసింహస్వామి కొరినవారి కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల పూజలందుకుంటున్నాడు. మానవ శరీరాన్ని పోలి మెత్తగా ఉన్న నాభి స్వామివారి సొంతమని అర్చకులు పేర్కొంటున్నారు. గుట్టపై బండరాళ్లతో కూడిన గుహలో స్వామి కొలువయ్యాడని, భక్తుల దర్శనార్థం గుహను తొలగిస్తున్న క్రమంలో స్వామి వారి నాభి వద్ద గాయం ఏర్పడిందని పురాణాల్లో ఉంది. ఈ గాయం నుంచి వచ్చే ద్రవాన్ని గంధంతో కలిపి భక్తులకు నాభి చందన ప్రసాదంగా నేటికీ అర్చకులు అందిస్తుండడం గమనార్హం. నాభి చందన ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అర్ధ చంద్రకారంలో ఉన్న హేమచలకొండ చుట్టూ దట్టమైన అడవి ఉంటుంది. ఆలయ సమీపంలో సహజసిద్ధంగా వెలిసిన చింతామణి జలపాతం సంవత్సరం పొడవునా జలధార పారుతూనే ఉంటుంది. ఔషధ గుణాలు కలిగిన చెట్ల వేర్ల నుంచి వచ్చే నీటిని సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని భక్తుల నమ్మకం. తెలంగాణతో పాటు సుమారు ఐదు రాష్ట్రాల నుంచి వందలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుంటారు.

అపురూప శిల్పకళ @ రామప్ప

వెంకటాపురం(ఎం) మండలంలోని పాలంపేట పరిధిలో ఉన్న రామప్ప దేవాలయం శిల్పకళాసంపదకు పెట్టింది పేరు. 1213 సంవత్సరంలో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి 2021లో యునెస్కో గుర్తింపు లభించింది. యునెస్కో గుర్తింపు లభించడంతో దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశీ పర్యాటకుల సంఖ్య సైతం పెరిగింది.



రామప్ప దేవాలయం

ఇసుకనే పునాదిగా చేసి, నీటిలో తేలాడే ఇటుకలతో ఆలయ గోపురాన్ని నిర్మించడం, సరిగమలు పలికే పొన్నచెట్టు, సహజసిద్ధమైన వెలుతురులో కాంతివంతంగా దర్శనమిచ్చే రామలింగేశ్వస్వామి రామప్పకే సొంతం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు రామప్ప ఆలయాన్ని సందర్శించారు. రామప్పకు వచ్చే పర్యాటకుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.62 కోట్లతో ప్రసాద్ ప్రాజెక్ట్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతోంది. రామప్ప ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉన్న రామప్ప సరస్సును రెండు గుట్టల మధ్య ఆనకట్ట నిర్మించి నిర్మించడం ఇక్కడ మరో ప్రత్యేకత.

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర.. మేడారం

తాడ్వాయి మండలం మేడారంలో గిరిజనుల కొంగు బంగారమైన సమ్మక్క– సారలమ్మ దేవతలు కొలువై ఉన్నారు. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా ప్రసిద్ధిగాంచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించింది. జాతీయ పండుగగా గుర్తించి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోంది. 2026లో జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుంది. జాతర కోసం ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు కేటాయించగా పనులు ప్రారంభమవుతున్నాయి. మేడారం జాతరకు ఈసారి 150 కోట్లకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా. మేడారం అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించగా, మేడారం గద్దెల ప్రాంతాన్ని సరికొత్తగా రాతితో నిర్మించేందుకు జిల్లాకు చెందిన మంత్రి సీతక్క చర్యలు తీసుకుంటున్నారు. గోదావరి నదికి ఉపనదిగా జంపన్నవాగు మేడారం ప్రాంతం నుంచే ప్రవహిస్తుండడంతో జాతర సమయంలో కోట్లాదిమంది భక్తులు అందులోనే పుణ్యస్నానాలచరించడం ఆనవాయితీ.



భక్తులతో నిండిన గద్దెల ప్రాంగణం(ఫైల్)

తెలంగాణ నయాగరా.. బొగత

వాజేడు మండలం చీకుపల్లి గ్రామశివారులోని బొగత జలపాతం సందర్శకులను కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రెగుట్టల్లో గల నల్లవాగు పొంగి ప్రవహిస్తూ గుట్టలపై జాలువారుతూ బొగత జలపాతంగా ప్రసిద్ధిగాంచింది. దట్టమైన పచ్చటి అడవుల మధ్య కొండకోనల్లో నుంచి ప్రవాహంగా వచ్చిన నీరు 30 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఇక్కడకు వచ్చిన పర్యాటకులు జలపాతం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈత కొలనులో ఆహ్లాదంగా గడుపుతారు. తెలంగాణ నయాగరా గా పేరొందిన బొగతకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశ నలుమూలలు, విదేశీ పర్యాటకులు సైతం వస్తుండడం గమనార్హం. జూలై నుంచి అక్టోబర్ వరకు వానాకాలంలో బొగత జలపాతం ఉధృతంగా జాలువారుతూ ఆకట్టుకుంటుంది. అధికారులు సందర్శకులకు వసతులు సైతం కల్పించారు. కానీ, జలపాతం ఉధృతంగా జాలువారుతున్న సమయంలో అధికారులు సందర్శనను నిలిపివేస్తుంటారు.



నేటి తరానికి ఆదర్శంగా చాకలి ఐలమ్మ




చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

కాజీపేట అర్బన్: నేటి తరానికి చాకలి ఐలమ్మ ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీశ్, మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కొనియాడారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, వరంగల్, హనుమకొండ జిల్లాల ఆర్డీఓలు రమేశ్, సత్యపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ క్రైం: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, శ్రీనివాస్, ఏఓ సంపత్, ఏసీపీలు అంతయ్య, జాన్ నర్సింహులు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేయూ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా ఇస్తారి

- ఉత్తర్వులు జారీ చేసిన కేయూ రిజిస్ట్రార్



ఇస్తారికి ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారిని నియమిస్తూ వీసీ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇస్తారి గతంలో జువాలజీ విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, హాస్టళ్ల డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీగా కూడా పనిచేశారు. 52 జాతీయ, నాలుగు అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనాపత్రాలు సమర్పించారు. ఆయన పర్యవేక్షణలో 13మంది పీహెచ్‌డీ పూర్తి చేశారు. యూనివర్సిటీలోని విద్యార్థి వ్యవహారాల విభాగంలో సమర్థవంతమైన పాలన, పరిశోధనల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత బలోపేతానికి స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా ఇస్తారి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఇస్తారికి ఉత్తర్వులు అందజేశారు. సంవత్సరంపాటు ఇస్తారి ఈ పదవిలో కొనసాగనున్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య తదితరులు ఇస్తారిని అభినందించారు.

ఆగిన పెన్షన్

నిధులు విడుదల చేయని ప్రభుత్వం

- ఆందోళనలో కేయూలోని వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు
- జూలై, ఆగస్టు నెలల్లో సర్దుబాటు చేసిన వర్సిటీ
- పెన్షన్‌దారులు 795 మంది
- ప్రతినెలా రూ.5.60కోట్లు అవసరం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని టీచింగ్, నాన్‌టీచింగ్, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు జూలై, ఆగస్టు నెలల పెన్షన్ గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేయడంతో జూలైకి సంబంధించిన పెన్షన్‌ను ఆగస్టులో, ఆగస్టు పెన్షన్ సెప్టెంబర్‌లో యూనివర్సిటీ అంతర్గత నిధులనుంచి యూనివర్సిటీ అధికారులు లబ్ధిదారులకు చెల్లించారు.

795 మంది రూ.5.60 కోట్లు

కేయూ పరిధిలో టీచింగ్ సర్వీస్ పెన్షనర్లు 210 మంది, టీచింగ్ ఫ్యామిలీపెన్షనర్లు 57 మంది, నాన్‌టీచింగ్ సర్వీస్ పెన్షనర్లు 296 మంది, నాన్‌టీచింగ్ ఫ్యామిలీ పెన్షనర్లు 232 మంది మొత్తంగా 795 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.5.60 కోట్ల పెన్షన్ చెల్లించాల్సి ఉంటుంది. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి పెన్షన్ గ్రాంట్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వర్సిటీ నిధుల నుంచి రూ.11.20 కోట్లు చెల్లించాల్సి వచ్చింది.

యథావిధిగా బిల్లులు

గతంలో మాదిరిగానే సర్వీస్‌లో ఉన్న రెగ్యులర్ అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్ల పెన్షన్ బిల్లులు ప్రతినెలా జిల్లా ట్రెజరీకి పంపుతున్నారు. గతంలో అందరికీ వేతనాలు, పెన్షన్ విడుదల చేయగా.. రెండు నెలలుగా పెన్షన్ నిధులు ఆపేశారు. దీనిపై వర్సిటీ అధికారులు కూడా స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

ఐఎంఎఫ్ఎస్‌లో ఉద్యోగుల వివరాలు

రాష్ట్ర ఆర్థిక శాఖ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎంఎఫ్ఎస్) నిర్వహిస్తుంది. ఇందులో కాకతీయ యూనివర్సిటీ టీచింగ్, నాన్‌టీచింగ్, అన్నికేటగిరీల ఉద్యోగులకు సంబంధించి వేతనాలతో కూడిన వివరాలు సమర్పిస్తేనే వేతనాల చెల్లింపునకు బ్లాక్ గ్రాంట్ విడుదల చేస్తారని సమాచారం. సెప్టెంబర్ వేతనాలు అక్టోబర్‌లో పొందాలంటే ఆయా ఉద్యోగుల వివరాలు ఐఎంఎఫ్ఎస్‌లో నమోదు చేయాల్సిందేనని యూనివర్సిటీకి ఆర్థిక శాఖ సూచించినట్లు తెలిసింది. దీంతో ఆయా ఉద్యోగుల వివరాలు నమోదు చేశారు. ఇందులో పెన్షన్‌దారుల వివరాల నమోదుకు అవకాశంలేకపోవడంతో యూనివర్సిటీ అధికారులు మాన్యువల్‌గా పంపించబోతున్నారని సమాచారం. ఈనేపథ్యంలో పెన్షన్ గ్రాంట్ అక్టోబర్‌లోనైనా రిలీజ్ అవుతుందా.. లేదా.. అనేది సందిగ్ధంగానే ఉంది.

వీసీని కలిసిన కుర్తా బాధ్యులు

రెండు నెలల పెన్షన్ నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో యూనివర్సిటీ నిధుల నుంచి చెల్లించారు. సెప్టెంబర్ నెల పెన్షన్ దసరా పండుగకు అందుతుందా.. లేదా.. అనే అంశంపై కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) బాధ్యులు రెండురోజుల క్రితం వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. దసరా నేపథ్యంలో అక్టోబర్ 1నాటికి పెన్షన్ వచ్చేలా చూడాలని వీసీకి విన్నవించినట్లు తెలిసింది.

బడ్జెట్‌లో కేటాయించినా..

యూనివర్సిటీలోని రెగ్యులర్ అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు కలిపి నిధుల కోసం యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తారు. దీంతో బ్లాక్ గ్రాంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈఏడాది జూన్ వరకు ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేసి చెల్లించింది. కానీ, గత రెండు నెలల నుంచే గ్రాంట్ రిలీజ్ చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 2025– 26 ఆర్థిక సంవత్సరానికి వేతనాలు, పెన్షన్ల కోసం యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించగా ప్రభుత్వం బడ్జెట్‌లోనూ రూ.149కోట్లకు పైగా నిధులను కేటాయించిన విషయం విదితమే. కానీ, ప్రస్తుతం నిధులు విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేంటనేది సందిగ్ధంగా మారింది.

ఆర్థిక కార్యదర్శిని కలవనున్న వీసీ

గత రెండునెలలు పెన్షన్ నిలిపివేయడంతో కేయూ అంతర్గత నిధులనుంచి చెల్లిండం ద్వారా వర్సిటీపై భారం పడుతుంది. అక్టోబర్‌లో సైతం పెన్షన్ చెల్లించాలంటే ఇబ్బందులు తప్పవని తెలిసిన వీసీ ప్రతాప్‌రెడ్డి.. ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి సందీప్ సుల్తానీయాను కలిసేందుకు వెళ్లినట్లు తెలిసింది. అయితే అక్టోబర్ 1న పెన్షన్ విడుదల చేయకుంటే పెన్షన్ సంఘాలు కార్యచరణ చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

డెంగీతో బాలుడి మృతి



మనీష్ (ఫైల్)

మడికొండ: నగరంలోని మడికొండకు చెందిన బాలుడు డెంగీ వ్యాధితో శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండకు చెందిన పెనుకు ల రాధిక– కుమార్ దంపతులు గత కొద్ది సంవత్సరాలుగా హైదరాబాద్‌లో కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు పెనుకుల మనీష్ (14) సంతానం. మనీష్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా.. ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.

ఏటీటీఎస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

గీసుకొండ: ఆదివాసీ తోటి తెగ సేవా సంఘం రాష్ట్ర కమిటీని శుక్రవారం జాన్‌పాకలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షెడ్మాకి సంజీవ్, అధ్యక్షుడిగా ఆత్రం కమలమనోహర్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రఘు, ఉపాధ్యక్షుడిగా ఆత్రం జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్రెంగ వేణు, కోశాధికారిగా షెడ్మాకి భిక్షపతి, వర్కింగ్ కార్యదర్శిగా సోయం రమేశ్, సహాయ కార్యదర్శిగా గుర్రాల సమ్మయ్య, సంయుక్త కార్యదర్శిగా సోయం శరత్‌బాబుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పరీక్షలు

న్యూశాయంపేట: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌యార్డు ప్రాంతంలో 184 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శుక్రవారం నిర్వహించిన పరీక్షలను జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు. ఈనెల 27, 29 తేదీల్లో జరిగే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ల్యాండ్ సర్వే సంచాలకులు శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ అడ్వాన్స్ ఇవ్వాలి

గీసుకొండ: జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు దసరా పండుగ అడ్వాన్స్ ఇవ్వాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గన్నారపు రమేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ అనిల్ కుమార్‌కు వారు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి కనీసం పండుగ అడ్వాన్స్ కింద రూ. 20 వేలు ఇవ్వాలన్నారు. యూనియన్ నాయకులు నూర సంపత్, జన్ను కొర్నేలు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి శేష వాహన సేవ



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అమ్మవారిని లలితా మహా త్రిపుర సుందరిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిత్యాహ్నికం, అభిషేకం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని స్కందమాత క్రమంలో దుర్గార్చన జరిపి పల్లకిసేవ, సాయంత్రం ధూమ్రహా క్రమంలో దుర్గార్చన జరిపి శేషవాహన సేవ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఈఓ రామల సునీత పర్యవేక్షించారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భర్తను హత్య చేసిన కేసులో మహిళ రిమాండ్

శాయంపేట : భర్తను హత్య చేసిన కేసులో మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన మహిళకు రిమాండ్ విధిస్తూ పరకాల జ్యుడిషల్ మేజిస్ట్రేట్ సాయిశరత్ తీర్పు వెల్లడించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన రేణుకుంట్ల రజిత 2020లో తన భర్తను హత్య చేసిన కేసులో కోర్టు వాయిదాలకు సరిగా హాజరు కాలేదు. దీంతో శుక్రవారం నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసి నర్సంపేట సబ్ జైలుకు 13 రోజుల రిమాండ్ విధిస్తూ పరకాల జ్యుడిషల్ మేజిస్ట్రేట్ సాయిశరత్ తీర్పునిచ్చినట్లు ఎస్సై పరమేష్ వెల్లడించారు.

నిందితుడికి వారెంట్ రీ కాల్

మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద చిన్నయ్య పై 2017లో గుడుంబా కేసు నమోదైంది. ఈకేసులో కోర్టుకు సరిగా హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. ఈక్రమంలో చిన్నయ్యను పరకాల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరు పరచగా మెజిస్ట్రేట్ సాయిశరత్ వారెంట్ రీ కాల్ చేసినట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.



● పేరెంటింగ్

మాటే... బాట

జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనల గురించి తల్లిదండ్రులు తరచూ పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి. మన మాటలతోనే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. ఆ మాటలు ఎలా ఉండాలంటే...

ఒక వ్యక్తి ప్రవర్తన వారు చూసిన, దగ్గరగా మసలిన వ్యక్తులు, వారి చుట్టూ ఉన్న ప్రపంచంపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో పరిసరాలు, మనుషుల ప్రభావం అధికంగా ఉంటుంది. అందుకే పిల్లలు తరచూ అనేక ఆలోచనలు, సందేహాలతో సతమతమవుతుంటారు. ఇవి ఒకదాన్ని ఒకటి డామినేట్ చేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనిస్తుండాలి.

అంతర్గత సౌందర్యమే అసలైన అందం

పిల్లలు టీనేజ్ లేదా యుక్తవయసుకు వచ్చినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పాళ్లు చాలా తక్కువగా ఉంటాయి. అన్ని విషయాల్లో ఇతరులతో పోల్చుకుని వారి కన్నా తాము తక్కువని ఫీలవుతుంటారు. శరీరం రంగు విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆ వయసులో వారికి అర్థమయ్యేలా వివరించడం కొంత కష్టం అయినప్పటికీ అందం తాత్కాలికమని, అసలు అందం అంటే తెలుపు, నలుపు రంగులకు సంబంధించిన విషయం కాదని చెప్పాలి. అలాగే ఎత్తు, బరువు, ఆకృతి అందచందాలకు గుణగుణాలకు కొలమానం కాదని, అంతర్గత సౌందర్యం మాత్రమే అసలైన అందమని వారికి విడమరచి చెప్పాలి. మన ప్రతిభను ప్రపంచానికి చూపేందుకు అనేక మార్గాలున్నాయని వారికి తెలియజెప్పాలి.

మీ కలలకు మేం రంగులద్దుతాం!

కలలు కనడం ఏమీ చెడ్డ విషయం కాదు. అయితే అవి ఆచరణసాధ్యం కానివి...పరిమితికి మించినవి కావడం మాత్రం కష్టంగా అనిపించే విషయం. పిల్లలు తాము ఎలా ఉండాలి? ఎవరిలా ఉండాలి... అనే విషయం గురించి తరచూ ఆలోచిస్తుంటారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల్లా ఉండాలని కోరుకుంటారు. మరికొందరు అంతకంటే మిన్నగా బతకాలని, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇంకా ఉన్నతస్థాయిలో ఉండాలని కోరుకుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇలాగే ఉండాలని శాసించకూడదు. వారి ఆలోచనలను తెలుసుకుని, కలలను సాకారం చేసుకోవడంలో తోడ్పడాలి. తమను తాము తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సలహాలు మాత్రమే ఇవ్వాలి. ఒకవేళ వారికి ఈ విషయంలో స్పష్టత లేకపోతే నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించాలి.

ఎలాంటి స్నేహాన్ని ఎంచుకోవాలంటే..?

మిత్రలాభం, సావాస దోషం ఈ రెండూ స్నేహం వల్ల కలిగే లాభ నష్టాలను సూచించే పదాలు. ఎందుకంటే స్నేహం పిల్లలను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఒకేవ్యక్తితో సావాసం చేయడం అన్నివేళలా అంత మంచిది కాదు. పెరుగుతున్న కొద్దీ స్నేహాలు కొంత క్లిష్టంగా మారుతుంటాయి. అందుకే తోటివారినెవరినీ విడదీసి చూసి ఎంపిక చేసుకునే బదులు అందరితో కలివిడిగా ఉండటం నేర్పాలి.. మంచి స్నేహితులు ఎప్పుడూ మిమ్మల్ని తక్కువగా చూడరు. అగౌరవపరచరు. మీ స్నేహాన్ని ఆస్వాదిస్తారు.. విశ్వాసపాత్రులుగా ఉంటారని వారికి వివరించి చెప్పాలి.

పోల్చిచూడవద్దు

కోరికలు, అవసరాలకు అంతనేది ఉండదు. మన దగ్గర ఉన్నదాంట్లో తృప్తి పడటం నేర్చుకోవాలి. అందుకు సదా కృతజ్ఞులమై ఉండాలి. అంతే తప్ప తోటివారితో పోల్చుకుని వారి వద్ద ఉన్నవి, అనుభవిస్తున్నవి మన దగ్గర లేవని బాధపడకూడదని చెబుతుండాలి.

ప్రవర్తనా లోపాలు ఉండరాదు

కొంతమంది పిల్లలు తోటి విద్యార్థులను బెదిరిస్తుంటారు. తల్లిదండ్రులను చిన్నచూపు చూస్తూ అవమానిస్తుంటారు. ఈ ప్రవర్తనను మొగ్గలోనే తుంచి వేయాలి. లేకపోతే మనం అమ్మానాన్నలుగా విఫలం అయినట్లే లెక్క. ఇతరులను బెదిరించడం, ఎగతాళి చేయడం తప్పని, పైగా అది ఇతరులకే కాదు, వారికి కూడా ఎంతో హాని కలిగించే విషయం కూడానని చెప్పాలి. అందుకే ఇంటిని, బడిని పిల్లలకు సురక్షితమైన ప్రదేశాలుగా ఉంచటం అత్యవసరం.

ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

దేవుడు మానవుల ఆత్మల్లో కొలువై ఉంటాడని, ఒకరికొకరు సాయం చేసుకోవడం, ఇతరులను గౌరవించడం నిజమైన దైవారాధన అని రవీంద్రనాథ్ ఠాగూర్ తరచూ బోధించేవారు. ఇలాంటి మహనీయుల ఆదర్శ వాక్యాలను పిల్లల మనసులో నాటుకునేలా తల్లిదండ్రులు పదే పదే చెబుతుండాలి.స్థాయీ భేదాలు, లైంగిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని చెప్పాలి. ఎవరూ తక్కువ కాదని, స్త్రీలు లైంగిక వస్తువులు కాదు... పురుషులంటే వారిని హింసించే వేటగాళ్లు కాదు... ఎవరూ ఎవరికీ సేవకులు లేదా బానిసలు కాదని చెప్పాలి.

సంతోషమే ఏకైక మార్గం

మనస్సును ఎల్లప్పుడూ సంతోషంగా ఉంచుకోవాలి. ఎవరైనా సంతోషంగా ఉండాలంటే మీ ముందున్న ఏకైక మార్గం మీ తోటివారిని సంతోషంగా ఉంచడమేనని తెలియజెప్పాలి.

అభిరుచులూ ముఖ్యమే!

చదువుకు అడ్డం అంటూ పిల్లలను క్రీడలు, లలిత కళలు లేదా ఇతర అభిరుచులకు దూరం చేయకూడదు. ఇవేమీ లేకుండా కేవలం చదువు ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోవాలి, మరే అభిరుచులూ ఉండకూడదంటే అది వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తుందని గుర్తుంచుకోండి

మంచితనమే మిన్న

ఏమి జరుగుతుందో అది జరుగుతుంది. మనం ఏం చేస్తే అదే మనకు తిరిగొస్తుంది. అది మంచయినా... చెడయినా... అందుకే ఎప్పుడూ తోటి వారితో సామరస్యంతో, మంచితనంతో ఉండాలని పిల్లలకు నేర్పించాలి.

లైఫ్@360

● అయ్యంగార్ యోగ

మల్లిక ఫిట్‌నెస్ మంత్ర



48 సంవత్సరాల వయస్సులో కూడా చక్కటి సౌష్ఠవంతో యువ నటీమణులతో పోటీపడుతున్న బాలీవుడ్ నటి మల్లికా షెరావత్. ఆమె తనను ఫిట్‌గా ఉంచే అయ్యంగార్ యోగా సాధన గురించి ఇటీవల ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది.

వేగంగా బరువు తగ్గాలని, తొందరగా ఫిట్‌నెస్ పెంచుకోవాలని ఇంచుమించు అందరూ అనుకుంటారు. అయితే అలాంటి క్విక్-ఫిక్స్ డైట్‌లు, ట్రెండింగ్ వర్కౌట్‌లు, సోషల్ మీడియా ట్రిక్స్ మూలంగా వచ్చిన ఫిట్‌నెస్ అంతే తొందరగా కరిగిపోతుందని తెలుసుకోలేక చాలామంది స్థిరమైన ఫిట్‌నెస్ మార్గాన్ని గాలికి వదిలేస్తుంటారు.

నా ఫిట్‌నెస్ ఫిలాసఫీ

''నా ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు యోగా చేయడమే కారణం. అంతేగానీ ఫ్యాషన్ డైట్‌లు లేదా క్రాష్ ప్రోగ్రామ్‌లు కాదు' అని మల్లిక ఇన్‌స్టా సాక్షిగా తేల్చి చెప్పింది. ఆరోగ్యంగా ఉండాలన్న తపన.. క్రమశిక్షణ, స్థిరత్వం తన అతి పెద్ద సాధనాలని నొక్కి చెప్పింది. ట్రెండీ ఫిట్‌నెస్ హ్యాక్‌లను ఆమోదించే చాలా మంది సెలబ్రిటీల మాదిరిగా కాకుండా, మల్లికా దీర్ఘకాలిక అలవాట్లను పెంపొందించుకోవడం వైపే మొగ్గు చూపుతుంది. అందుకే అయ్యంగార్ యోగాను తన దిన చర్యలో భాగంగా మార్చుకుంది.

ఫిట్‌నెస్‌ను తాను తాత్కాలికంగా తీసుకోలేదని, దానిని తన జీవనశైలిలో భాగంగా చేసుకున్నానని చెబుతూనే, అయ్యంగార్ యోగా వల్ల తన శరీరాన్ని షేప్ కోల్పోకుండా ఉంచుకోవడమే కాకుండా, తన బిజీ జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడానికి, ముఖ్య విషయాల మీద దృష్టి పెట్టడానికి సహాయపడిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది.

ఏమిటీ అయ్యంగార్ యోగా?

అయ్యంగార్ యోగకూ పతంజలి ఋషి యోగ సూత్రాలకూ అవినాభావ సంబంధం ఉంది. అష్టాంగ యోగా ఎనిమిది అంశాలను ఆచరణాత్మక వ్యవస్థలో మిళితం చేస్తుంది. అధికారిక అయ్యంగార్ యోగా వెబ్‌సైట్ ప్రకారం, దాని క్రమం, ఆధారాల ఉపయోగం, భద్రతపై ప్రాధాన్యత దీనిని ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా అభ్యసించే యోగా రూపాలలో ఒకటిగా మార్చాయి.

అయ్యంగార్ యోగాలో కీలకమైన అంశం ఏమిటంటే పట్టీలు, బోల్‌స్టర్లు, బ్లాక్స్, తాళ్లు వంటి ఆధారాలను ఉపయోగించడం. ఈ సాధనాలు ప్రారంభకులకు అధునాతన అభ్యాసకులకు సరైన భంగిమను సాధించడంలో సహాయపడతాయి. అదే సమయంలో గాయం ప్రమాదాలను తగ్గిస్తాయి. ఇది అభ్యాసాన్ని అత్యంత సమగ్రంగా చేస్తుంది. అన్ని వయసుల వారికి, ఫిట్‌నెస్ స్థాయిలకు అనుకూలంగా ఉంటుంది.

మెదడుకు చురుకైన ఆహారం



రోజువారీ ఆహారంలో కూరగాయలు, లీన్ ప్రోటీన్లు, మంచి కొవ్వు, మరిన్ని... దశాబ్దాలుగా, మెడిటేరియన్ డైట్ తీసుకోవడం వల్ల మెదడు వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

గ్రీన్ టీ: ఇది మీ న్యూరాన్లకు శక్తినిస్తుంది: గ్రీన్ టీలో కాటెచిన్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి వాపులను, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి కావలసిన శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఇవి న్యూరోడీజనరేషన్‌కు కీలకంగా పనిచేస్తాయి.

మెదడు పనితీరును పెంచే మొక్క మన్కై

దీనిని 'డక్ వీడ్' అని కూడా పిలుస్తారు, మన్కై అనేది పాలీఫెనాల్స్, బీ12, మొక్కల ఆధారిత ప్రోటీన్లతో నిండిన ఒక చిన్న వాటర్ ప్లాంట్. ఇది మెదడు వృద్ధాప్యంతో ముడిపడి ఉన్న కీలక ప్రోటీన్‌లను నియంత్రించడంలో సహాయ పడుతుంది.

చెడును తొలగిస్తుంది, మంచిని జోడిస్తుంది

గ్రీన్-మెడ్ ప్రణాళిక ఆరోగ్యకరమైన పదార్థాలపై మాత్రమే కాదు, ఇది రెడ్ మీట్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్‌లను కూడా తగ్గిస్తుంది, రెండూ వృద్ధాప్యంతో ముడిపడి ఉన్నాయి.

మెడిటరేనియన్ డైట్ అంటే...

పుష్కలంగా పండ్లు, కూరగాయలు, బ్రెడ్, ఇతర ధాన్యాలు, బంగాళదుంపలు, బీన్స్, గింజలు, ఆలివ్ నూనెనే ఎక్కువగా వాడతారు. పాల ఉత్పత్తులు, గుడ్లు, చేపలు వంటివి మెడిటరేనియన్ డైట్ లో మితంగా తీసుకుంటారు. ఈ ఆహారంలో రెడ్ మీట్ కంటే చేపలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. మొక్కల ఆధారిత ఆహారాలనే ఎక్కువగా తింటారు.



వ్యాపించకుండానే వాష్ చేసేద్దాం

అంటువ్యాధులతోపాటు రకరకాల సీజనల్ వ్యాధుల వ్యాప్తిని, ఇన్ఫెక్షన్లను నివారించడానికి అతి తేలికైన, అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి 'హ్యాండ్‌వాష్'. అవును, నిజమే. చేతుల పరిశుభ్రత వల్ల జీర్ణకోశ వ్యాధులు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు గణనీయంగా తగ్గుతాయని శాస్త్రీయ అధ్యయనాలు చూపిస్తున్నాయి. సబ్బుతో చేతులు కడుక్కోవడం, ముఖ్యంగా టాయిలెట్ ఉపయోగించిన తర్వాత, తినడానికి ముందు, చర్మంపై ఉన్న చాలా సూక్ష్మజీవులను సమర్థంగా తొలగించగలదు. ముఖ్యంగా వర్షాకాలంలో, వర్షంలో తడిసినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధుల వ్యాప్తి గణనీయంగా తగ్గుతున్నట్లు అధ్యయనంలో రుజువైంది.


సాక్షి సినిమా



● ప్రభాస్



● మహేశ్‌బాబు



● ఎన్టీఆర్



● రామ్‌చరణ్



● నాని

మిషన్ మేకోవర్

కథ డిమాండ్ మేరకు సినిమా సినిమాకు కొత్త లుక్స్‌లోకి మారిపోతుంటారు హీరోలు. కథల్లోని హీరో క్యారెక్టరైజేషన్‌కు తగ్గట్లుగా గెటప్ మార్చేస్తుంటారు. ఇలా తమ కొత్త సినిమాల కోసం కొందరు హీరోలు ఒక 'మిషన్' మీద ఉన్నారు. ఆ మిషన్ ఏంటంటే 'మేకోవర్'. ఈ 'మిషన్ మేకోవర్' విశేషాలు తెలుసుకుందాం.

రాముడి పాత్రలో..?

సిల్వర్ స్క్రీన్‌పై లాంగ్ హెయిర్, గడ్డంతో మహేశ్‌బాబు కనిపించి చాలా సంవత్సరాలైంది. ఇప్పుడు రాజమౌళి దర్శకత్వంలో చేస్తున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) సినిమా కోసం మహేశ్ బాబు పూర్తిగా మేకోవర్ అయ్యారు. హెయిర్, గడ్డం పెంచారు. అలాగే వర్కౌట్స్‌తో ఫిజికల్‌గా కూడా ధృడంగా తయారయ్యారు. కాగా ఈ కథకు మైథలాజికల్ టచ్ కూడా ఉందని, ఈ చిత్రంలో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈ వార్త నిజం అయితే 'ఎస్ఎస్ఎమ్ బీ29'లో మహేశ్ బాబును ప్రేక్షకులు పలు రకాల లుక్స్‌లో చూసే అవకాశం ఉంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది నవంబరులో ఈ సినిమా అప్‌డేట్‌ను ఇస్తామని రాజమౌళి చెప్పారు. నవంబరులో ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేస్తారని భోగట్టా. దాదాపు రూ. 1000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చిలో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది.

పోలీస్ ట్రైనింగ్

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలోని 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ప్రభాస్. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు. ఈ హీరో పోలీస్‌గా కనిపించనున్న తొలి చిత్రం ఇదే. దీంతో 'ది రాజాసాబ్, ఫౌజి' చిత్రాల షూటింగ్ పూర్తికాగానే, 'స్పిరిట్'లో పవర్‌ఫుల్ పోలీస్ లుక్ కోసం ప్రభాస్ మేకోవర్ కావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకోనున్నారట. ఈ చిత్రంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ఇండియాలోని ప్రముఖ లోకేషన్స్‌తో పాటు మెక్సికో, యూకే వంటి విదేశీ లొకేషన్స్‌లోనూ 'స్పిరిట్' చిత్రీకరణ జరగనుంది. టీ సిరీస్ ఫిలింస్, భద్రకాళి ప్రొడక్షన్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

బరువు తగ్గాలని...

ఎన్టీఆర్ హెవీ వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియో ఇటీవల వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ హీరో ఈ రేంజ్‌లో కష్టపడుతున్నది 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా కోసమే. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఆల్రెడీ సినిమా షూటింగ్ కొంత భాగం పూర్తయింది. అయితే కథ రీత్యా ఈ సినిమాలో ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారట. ఈ లుక్ కోసమే ఎన్టీఆర్ మేకోవర్ అవుతున్నారని తెలిసింది. ఈ లుక్ కోసం బరువు తగ్గే మిషన్ మీద ఉన్నారు. ఇక ఇటీవల ఓ యాడ్ షూటింగ్‌లో భాగంగా ఎన్టీఆర్ స్వల్పంగా గాయపడ్డారు. వైద్యులు ఆయనకు రెండు వారాల పాటు విశ్రాంతి సూచించారు. దీంతో ప్రస్తుతం ఎన్టీఆర్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. కోలుకున్న తర్వాత తిరిగి ఆయన 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ విదేశాల్లో ప్రారంభం కానుందని తెలిసింది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు టొవినో థామస్ విలన్ రోల్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

ద్విపాత్రాభినయం?

'పెద్ది' సినిమా కోసం బరువు పెరిగారు రామ్‌చరణ్. సరైన వర్కౌట్స్, డైట్‌తో పూర్తిగా కొత్తగా మేకోవర్ అయ్యారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రామ్‌చరణ్ ఫస్ట్ లుక్ విడుదలైంది. కానీ ఈ లుక్ కాకుండా మరో లుక్‌లో కూడా రామ్‌చరణ్ కనిపిస్తారు. ఈ రెండో లుక్ కోసమే ఈ హీరో బరువు పెరిగారని తెలిసింది. ఇలా 'పెద్ది'లో రెండు లుక్స్‌లో కనిపించనున్నారనే టాక్ తెరపైకి రావడంతో ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అలాగే ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ వేరియేషన్స్ ఉంటాయని, ఇందులో భాగంగానే డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారనే ఊహాగానాలూ ఉన్నాయి. త్వరలో ఈ విషయాలపై ఓ క్లారిటీ వస్తుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

డిఫరెంట్ జడల్

'ది ప్యారడైజ్' ప్రపంచం కోసం పూర్తిగా మారిపోయారు హీరో నాని. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో జడల్ అనే డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు నాని. ఈ జడల్ పాత్ర కోసం నాని ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఇంటెన్స్ అండ్ హెవీ వర్కౌట్స్‌తో బరువు పెరిగారు. ఇక ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో మోహన్‌బాబు, 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్ నెగటివ్ రోల్స్ చేస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 26న విడుదల కానుంది.

ఇలా తమ కొత్త సినిమాల కోసం లుక్స్, గెటప్స్ మార్చుకున్న, మార్చుకుంటున్న హీరోలు మరికొంతమంది ఉన్నారు.

– మునిమి శివాంజనేయులు

మా ప్రపంచం వేరు



● ఆయుష్మాన్, రష్మిక

ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ మిస్టరీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ చిత్రానికి 'ముంజ్య' ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ చిత్రంలో అలోక్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కా పాత్రలో రష్మికా మందన్నా నటించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ముంబైలో జరిగింది. శ్రద్ధా కపూర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ''ఏ... నాటకాలు ఆపు... నీకేం కాలేదు, నా కొడుకు సైతాన్... సైతాన్, నేను నీతో ఉండలేను... మా ప్రపంచం వేరు'' అని అర్థం వచ్చే డైలాగ్స్ ఈ హిందీ ట్రైలర్‌లో ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా 'థామా' సినిమాను అక్టోబరు 21న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా వెల్లడించారు.

వినోదాల విందు



● నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా కొత్త ప్రోమో వీడియోను టీజర్‌లా రిలీజ్ చేశారు మేకర్స్. ఓ ఆభరణాల ప్రకటనకు స్పూఫ్‌గా ఈ ప్రోమోను చేశారు. ''తనదైన కామెడీ టైమింగ్‌తో 'అనగనగా ఒక రాజు' సినిమాలో ప్రేక్షకులను అలరించనున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు వినోదాల విందుని హామీ ఇస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

చార్మినార్‌లో సందడి



● లక్ష్య, అనన్యా పాండే



● చార్మినార్ దగ్గర...

స్టార్ట్ కెమెరా... టేక్ అన్నారు డైరెక్టర్ వివేక్ సోని. అంతే... హీరో లక్ష్య బైక్ స్టార్ట్ చేశారు... వెనకాల హీరోయిన్ అనన్యా పాండే కూర్చుకున్నారు. రయ్‌మంటూ బైక్ ముందుకు సాగింది. సీన్ పూర్తయింది. షాట్ ఓకే అన్నారు వివేక్. ఈ షూటింగ్ జరిగింది ఎక్కడంటే హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గర. ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో లక్ష్య, అనన్య కలర్‌ఫుల్‌గా కనిపించారు. అక్కడి జనాలు వీరిని గుర్తు పట్టి, చుట్టుముట్టారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. లక్ష్య, అనన్యా పాండే జంటగా నటిస్తున్న కాలేజ్ రొమాంటిక్ మూవీ 'చాంద్ మేరా దిల్' కోసమే ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఈ ఇద్దరూ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రం షూటింగ్‌ని వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. చార్మినార్ తర్వాత మరో పాపులర్ ప్లేస్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.